


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

***మహా కన్యాదేవి***

**మహా కన్యాదేవి** ఆశ్రమం చాలా హడావిడిగా వుంది. మరో పన్నెండుగంటల్లో కాశీ ప్రయాణం వుంది. ఏలూరి దగ్గరచింతలపూడి (తాలూకా/గ్రామం)నించి పదహారు మైళ్ళు ప్రయాణిస్తే వచ్చే వూరు పెదపుల్లేటిక్కుర్రు. ఆ వూరికి తూర్పున తగులుతుంది తమ్మిలేరు. చాలా అందమయిన ఏరు అది. ఆయేటి ఒడ్డునేవుంది మహా కన్యాదేవి ఆశ్రమం.

ఆవిడ ఎవరో ఎక్కడ్నించి వచ్చిందో పెదపుల్లేటిక్కుర్రు జనాలకు పెద్దగానూ స్పష్టంగానూ తెలీదుగానీ, అవధాన్లుగారికి మాత్రం బాగా తెలుసు.

"ఒరే అబ్బాయిలూ, ఆవిడ ఎనిమిదో ఏట సన్యసించిందిరా. నిప్పు అంటే నిప్పు అనుకోండి. ఆవిడ గురువుగారి పేరు నిశ్చలానంద. చాలా మహానుభావుడు. అనేక భాషలు తెలిసినవాడు. వేదోపనిషత్తుల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవాడు. కాశీలోని పండితులకి ఏదన్నా ఆధ్యాత్మిక సంశయం వస్తే నిశ్చలానందనే అడిగేవారు. ఆయన ప్రజ్ఞ అటువంటింది." ఆగారు అవధాన్లుగారు.

"అవును అవధాన్లుగారు, యీ సన్యాసులు, పీఠాధిపతులు వారి నామంలో 'ఆనంద' శబ్దాన్ని ఎందుకు చేరుస్తారు?" అడిగాడో సందేహి.

"అవునవును.. చాలా పేర్లు గమనిస్తే 'ఆనంద' వుంటుంది" సందేహికి సపోర్టుగా నిలబడ్డాడు మరో నిస్సందేహి.


"ఎందుకంటే మానవుడు పుట్టిన వెంటనే ఏడ్చినా, అతని సమాజమైన స్వరూపం ఆనంద స్వరూపమే గనక" నిశ్చలంగా అన్నారు అవధాన్లుగారు.

"అదెలా?" ప్రశ్నించాడు మరో సందేహి.

"పుట్టగానే ఏడవడానికి కారణం 'బొడ్డు' తాడుని కొయ్యడం దాంతో అప్పటివరకూ వున్న 'లింక్' తెగిపోతుంది. అప్పటివరకూ తల్లి హార్ట్‌బీటూ,ఆహారమే పిల్లవాడిది కూడా. ఏ క్షణంలో బొడ్డు కోశామో ఆ క్షణం నించీ ఎవరి హార్ట్ బీటూ వారిదే, ఎవరి ఆకలీ, ఆహారమూ వారిదే సరే, అది దేనికి సంకేతం? నువ్వు పుట్టిన క్షణం నించే సర్వ స్వతంత్రుడవనేదానికి సంకేతం" ఆగారు అవధాన్లుగారు. చుట్టూ చేరిన వాళ్ళు జాగ్రత్తగా వింటున్నారు.

"ఆ తరవాత ఎవరో ఎత్తుకుని బుగ్గలు నిమురుతారు. పకపకా నవ్వుతావు. ముద్దుగా పైకి ఎగరేస్తారు. పగలబడి నవ్వుతావు. చీచీ.. చీచీ అంటూ అటూ ఇటూ వూపుతారు. మహదానందంగా బోసినవ్వులు పంచుతావు. అబ్బాయిల్లారా, మనిషి సహజంగా ఆనంద స్వరూపుడు. పళ్ళు రావడం మొదలెట్టిన దగ్గర్నించీ 'నాదీ' అనే భావన మొదలవుతుంది.

క్రమక్రమంగా యీలోకంలోని లౌక్యం, అహంకారం ఇవన్నీ. ఆ ఆనందమనే దానిస్తానాన్ని ఆక్రమిస్తాయి. ఇటు చూడండి'' అంటూ రెండు పాత్రలు బొమ్మలు వేశాడు అవధాన్లు.



''మొదటి పాత్ర నిండుగా తేనె వున్నది. దాని పేరు ఆనందం. ఇప్పుడు నిండుగా వున్న తేనె పాత్రలో గులకరాళ్ళు పోశావనుకో గులకరాళ్ళు పాత్రలోకి జారంగానే తేనె బయటికి కారిపోతుంది. ఆ తరువాత ఇసుక పోశావనుకో. మళ్ళీ తేనె బయటికి పోతుంది. ఆ తరువాత బొగ్గులూ రాళ్ళూ పోసి నింపేశావనుకో. ఎక్కడో పాత్ర గోడలకి అంటుకున్న తేనె తప్ప మిగతా పాత్ర అంతా దేనికీ పనికిరాని పదార్థాలతో నిండివుంటుంది. మనలోనే వున్న తేనెను మనమే నేలపాలు చేసుకుంటున్నాం. మితిమీరిన కోరికలు, మితిమీరిన ఆశ, అహంకారం, ఈర్ష్య మదం, అసంతృప్తి వీటన్నిటినీ మనస్సనే తేనెపాత్రలో నింపి, ప్రేమ - శాంతి అనే తేనెను పోగొట్టుకుని అలమటిస్తున్నాం. నాయనలారా, యోగులు, సన్యాసులూ, సన్యాసినులూ, ఫకీర్లు వీరంతా 'మన నిజస్థితి'ని మనకి తెలియజేసే ప్రయత్నం చేస్తూంటారు. మనం వాళ్ళని హేళన చేసి మన ప్రశాంతతని మనమే నాశనం చేసుకుంటున్నాం'' ఉపన్యాసంలాంటి సంభాషణని ముగించి లేచారు అవధాని.

''అయ్‌గోరూ, మీరా కన్నమ్మగారి గురించి మాట్లాడతా. దారిమళ్ళారండి'' గుర్తుచేశాడు హనుమంతు. హనుమంతుకి పన్నెండేళ్ళుంటాయి. మహా చురుకైనవాడు. ఎంత చురుకో అంత మొండి. మనిషిని ఇష్టపడితే ప్రాణమిస్తాడు. లేకపోతే పిలిచినా పలకడు.

''ఓహో.. నువ్వూ వింటున్నావుటా! మంచిది చెబుతా విను'' మళ్ళీ కూర్చున్నాడు అవధాని. ఆయనకి గతం గుర్తుకొచ్చింది.

తండ్రి అస్తికలు గంగలో కలపడానికి వెళ్ళినప్పుడు గంగలో జారిపడ్డాడు. అప్పుడు క్షణాల్లో నిశ్చలానంద తనని రక్షించకపోతే ఏనాడో జీవితం గంగపాలయ్యేది.

చిన్నతనంనుంచీ చెడ్డ స్నేహితులే. తండ్రి బాగుపడమని బ్రతిమాలినా, బామాలినా ఏనాడూ చెవిని పెట్టలేదు. అలాంటిది, నిశ్చలానంద తెలుగువాడు. పెదకుల్లేటికుర్రు ఆశ్రమం నిశ్చలానందగారి స్వంత స్థలంలో కట్టిందే మహా కన్యాదేవిని నిశ్చలానందే పెదపుల్లేటి కుర్రు ఆశ్రమానికి పంపారు. పంపుతూ లేఖ వ్రాశారు.

''అదిగో, అలా నేనీ ఆశ్రమానికి ఓ విధంగా బంధువునీ, మరో విధంగా కేర్ టేకర్‌నీ అయ్యాను'' తన కథని వివరించారు అవధాన్లుగారు.

''అవధానిగారూ మహా కన్యాదేవిగారి గురించి వినడమేగానీ, ఈ వూళ్లో చాలామంది చూడనేలేదు. ఎందుకు బయటకి రారూ?'' ప్రశ్నించాడూ ఓ కుర్రవాడు.

''బాబూ.. ప్రచారం కోరుకునేవాళ్ళు పబ్లిక్‌తో సంబంధం పెట్టుకుంటారు. ఆవిడకి ప్రచారాలూ, ఆర్భాటాలూ అక్కరలేదు. అంతెందుకూ, ఆమె వచ్చినప్పుడు మాత్రం కొన్ని క్షణాలు ఆవిడ్ని చూశాను. మళ్ళీ ఇప్పటివరకూ నేనే చూడలేదు'' సిన్సియర్‌గా అన్నారు అవధాని.

''ఎలా వుంటారూ?'' కుతూహలంగా అడిగాడొకడు.

''ఖచ్చితంగా దేవతామూర్తేగానీ, మానవులకి పుట్టింది కాదు. అసలామె మొహం వంక చూడలేము. ఆ తేజస్సుకి కళ్ళు గిర్రున తిరిగి వాలిపోతాయి'' భక్తిగా అన్నాడు అవధాని. అతని కళ్ళల్లో మహాకన్యాదేవి రూపం మెదిలింది. పెదపుల్లేటికుర్రుకి వచ్చినప్పుడు ఆవిడ వయసు పదహారుంటుందేమో ఆ లెక్కన అయితే ఇప్పుడు పాతిక. కాశీనించి మొత్తం పదహారుమంది సన్యాసినులు వచ్చారు. ఇప్పుడూ వారేవుంటున్నారు ఆశ్రమంలో. వారిలో చాలామంది ఉత్తర భారత దేశంవారు. మహా కన్యాదేవి భాష ఏమిటో కూడా అవధానికి తెలీదు.

వారందరిలోకీ పెద్దది మాయిమయి. ఆవిడ వయస్సు ఓ నలభై ఉంటుంది. ఆశ్రమం వ్యవహారాలన్నీ ఆవిడే చూస్తుంది. నిశ్చలానందగారికి చాలా ఆస్తివుంది. అందువల్ల డబ్బుకి కొదువలేదు.

''మేము ఆవిడ్ని చూడొచ్చా?'' ఉత్సాహంగా అన్నాడు ఓ యువకుడు.

''బాబూ.. ఆశ్రమం అంటే తాటాకుల పందిరిగాదు. 24 గదులున్న మహాభవనం, వంటిల్లు వేరు. కనీసం వందమంది హాయిగా పడుకునేంత పెద్ద హాలుంది. 20 అడుగుల ఎత్తున్న ప్రహారీగోడ చుట్టూ వుంది. స్త్రీలు మాత్రమే అక్కడ వుంటున్నా, అంత నిర్భయంగా వుంటున్నారంటే వారికేదో రక్షణ కవచంలాంటి శక్తివుండాలి. మహామాయ అనుమతిలేనిదే ఎవ్వరూ లోపలికి అడుగుపెట్టలేరు. వారు నన్ను పిలిపించినా గేటుకి ఓ పది అడుగుల దూరంలో వున్న గదిలో కలుస్తారే తప్ప లోపలికి అనుమతించరు.'' వివరించాడు అవధాని.

''ఏవిటో... ఇన్నేళ్ళు ఇక్కడున్నా ఆశ్రమం ఇంత సీక్రెట్ మెయిన్‌టెయిన్ చేస్తుందని తెలవనే తెలవదుగదా! పోనీలే పుణ్యం చేసిన వాళ్ళదాపున మనం వుంటే, మనకీ మంచే జరుగుతుంది'' పెద్దాయన అన్నాడు.

''నిజం అన్నావు బాబాయ్'' లేచారు. అందరూ, అవధానితో సహా.

''ఎలాగైనా లోపలికి వెళ్ళాలి. వాళ్ళందర్నీ చూడాలి''

మౌనంగా లోలోపలే నిర్ణయం తీసుకున్నాడు హనుమంతు.

***రహస్యం***

''నేను తప్ప యీ యీదురు గాలినించీ, వర్షం నించీ, గండాలనించీ ఎవరూ నిన్ను రక్షించలేరు'' నవ్వుతూ అన్నాడు విలియమ్స్.

అతను నోరు తెరిచి మాట్లాడకపోయినా, ఆ మాటలు శ్రీనివాస్‌కి అర్థమవుతున్నాయి.

''రాబీ వాళ్ళందరూ ముందరి కార్లో వున్నారు'' మాట్లాడాననుకున్నాడు శ్రీనివాస్.

''ఇప్పుడా కారు రోడ్డుపక్కనున్న గోతిలో పడింది. వాళ్ళందరూ బాగానే వున్నారు. కానీ ఆకలికి నకనకలాడుతున్నారు.'' నవ్వాడు మళ్ళీ విలియమ్స్.

''నన్నెందుకు కాపాడుతున్నారు?'' మనసులో అనుకున్నది అతనికి తెలుస్తుందని.

"కారణం వుంది. ఓ మహాయుద్ధం జరగాల్సివుంది. అది ఏ ప్రాంతానికో, భాషకో పరిమితమయినది కాదు. దానికి కారణం కూడా ఇప్పటిది కాదు. ఓయీ, మనుషులు అనుకుంటారు. మనం ఏ పని చేసినా ఎవరికీ బాధ్యులం కాదని. అది తప్పు. మనం చేసే ప్రతిపనీ ప్రతిఫలం మనమే అనుభవించాలి." ఆగాడు విలియమ్స్.

"ఎలా?" భయం తగ్గి కుతూహలంగా అడిగాడు శ్రీనివాస్.

"భూమిలోపలవుండే ఖనిజాలూ, ద్రవాలు, వాయువులూ భూమిని చల్లబరచడానికి వున్నాయి. వాటివల్లనే ప్రకృతి సమతౌల్యం ఏర్పడుతుంది. బంగారం తవ్వి తీస్తున్నాం అన్ని ఖనిజాలనూ తవ్వి తవ్వి భూమిని డొల్లచేస్తున్నాం. భూమిలోపలి క్రూడాయిల్నంతా పైకిలాగేస్తున్నాం. ఆఖరికి బొగ్గుని కూడా తవ్వి తవ్వి భూమిని డొల్లగా మారుస్తున్నాం. దానివల్ల సంభవించేది ఏమిటో తెలుసా? ప్రకృతి సర్వనాశనమవుతుంది. అయితే వూరుకోదు. తనని తాను రక్షించుకునే ప్రయత్నం మొదలెడుతుంది. ప్రచండ భూ కంపాలని సృష్టించి తనలోని శూన్యాన్ని వడ్డీతో సహా పూడ్చేసుకుంటుంది. సముద్రాల్ని ప్రేరేపించుకుని భయంకరమైన తుఫాన్లనీ, సునామీలనీ సృష్టిస్తుంది. ఇక్కడి భూభాగాన్ని మింగేసి మరోచోట ఎక్కడో మేటలు వేస్తుంది. తద్వారా, తనని తాను ప్రకృతి మళ్ళీ సృష్టించుకుంటుంది. శ్రీనివాస్, మనిషి జాతి జాతంతా కూడా అంతరించిపోవచ్చు. అంత భయంకరంగా ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాడు మనిషి.

కొండలూ లోయలూ ఉన్నది ప్రళయకాలంలో మనిషిని ఆదుకోవడం కోసం. వాటినీ మనిషి ధ్వంసం చేసి కంకరగా మారుస్తున్నాడు. ఇనుము వంటిలోహాల్ని నానా చెత్త పనులకీ ఉపయోగించి పన్నీటిని బూడిదలో పోసినట్టు అమూల్యమైన ఆ లోహసంపదని దుర్వినియోగం చేస్తున్నాడు." ఆగాడు విలియమ్స్.

"అయితే ప్రకృతి సంరక్షణ కోసం మీరు ఆత్మరూపంలో ఉన్నారా? మిస్టర్ విలియమ్స్.. మీరు రుద్ర ఆత్మ అని భావిస్తూ చెయ్యరాని తప్పు చేశాను నన్ను మన్నించండి" పరితాపంతో అన్నాడు శ్రీనివాస్.

"ప్రకృతిని నేనో, నాలాంటి తిరుగాడే ఆత్మలో సంరక్షించనక్కరలేదు శ్రీనివాస్. అంతకంటే గొప్ప విపత్తు వుంది అది ఎటువుందో ఇప్పుడు నీకు చెప్పినా అర్థంకాదు. ఎందుకంటే పంచభూతాలన్నీ (నేలా నింగీ నీరూ నిప్పూగాలి) కాలుష్యంలో దాదాపుగా నిండిపోవచ్చాయి. నిజం చెబితే మానవజాతి మరణం అంచున వున్నది. ఒక్క 'ధనం' కోసమూ, 'అధికారం' కోసమూ అతి నీచమయిన స్థాయికి దిగజారింది మానవజాతి. ప్రాణవాయువునిచ్చే చెట్లని లక్షల సంఖ్యలో ప్రతిరోజూ నరికేస్తోంది. దాహం తీర్చడమేగాక అమితమైన శక్తి నిచ్చే 'నదీజలాల్ని' విషద్రవాలతో, మురికి నీటితో సర్వనాశనం చేస్తున్నది. సముద్రానికి చేరుకోవలసిన నదులకి కట్టరానంత ఎత్తుగా ఆనకట్టలు కట్టి సముద్రాల్ని నిర్వీర్యం చేస్తున్నది. ఈ మానవజాతి ఇప్పుడు చేస్తున్న వినాశనానికీ ఆగడాలకీ అంతేలేదు. సరే.! నిన్ను నేను రక్షిస్తాను. ముందు కొంత ఆహారాన్నీ నీటినీ తీసుకు పద. రెండువందల గజాల దూరంలో వుంది. వారు కూర్చున్న కారు." చెప్పాడు విలియమ్స్. వెనకనున్న బాగ్‌లోనించి కొన్ని తినుబండారాల్నీ వాటర్ బాటిల్స్‌నీ తీశాడు శ్రీనివాస్.

"మిస్టర్ విలియమ్స్.. నాకు రెండు సందేహాలున్నాయి. తీర్చగలరా?" వినయంగా అడిగాడు శ్రీనివాస్.

"అడుగు"

"మన మాటలన్నీ డ్రైవర్ వినుంటాడా?"

"నా మాట నీకు తప్ప అతనికి వినిపించదు. నీకు తప్ప నేనతనికి కనిపించను. అఫ్‌కోర్స్.. నేను కావాలని అనుకున్నప్పుడు మాత్రమే కనిపిస్తా.

"నేను కూర్చున్నది ఫ్రంట్ సీట్లో.. మరి మీరు?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీనివాస్.

"నేనూ ఇక్కడే కూర్చున్నా. నీకూ నాకూ మధ్య దూరం చిటికెన వేలంత కూడా వుండదు. కానీ మనిద్దరి మధ్యా రెండడుగుల దూరం వున్నట్టు భ్రమింపజేస్తుంది. ఇప్పటివరకూ నీకు డ్రైవరున్నాడనే స్పృహే లేదుగా!" నవ్వాడు విలియమ్.

"మరో ప్రశ్న సార్.. యీ ఈదురుగాలినీ, భయంకరమైన వర్షాన్నీ చీకట్నీ సృష్టించింది మీరా?"

"కాదు.. కానేకాదు.." తలవొంచుకుని సైలెంటయ్యాడు మిస్టర్ విలియమ్స్.

"సారీ.. ఇప్పుడు ఎలా అక్కడకు వెళ్ళాలి?"

“Just follow me”

శ్రీనివాస్ కారు దిగాడు సామాన్లతో. ఓ పెద్ద గొడుగు అతనిపైన కప్పినట్టు అనిపించింది. అంత చీకట్లోనూ అతనికి ఏదో చిత్రమైన కాంతి కనిపిస్తోంది. గాలీ వానా విషయం అతనికి గుర్తేలేదు.

"అయ్యా. నేను అడవిలోకి వెళ్ళిరావచ్చా?" అడిగాడు మట్టు. చిన్నగా నవ్వాడు రామజోగి.

"నాకు తెలుసు ముట్టూ.. పనీపాటా లేకుండా కూర్చుంటే, సోమరితనం అలవాటవుతుందనీ, శరీరం యొక్క చురుకుదనం తగ్గిపోయి మొద్దుబారుతుందని నీ ఉద్దేశ్యం అవునా?" అన్నాడు.

"నిజం చెప్పారు. అమ్మ పెట్టే భోజనంతో ఒళ్ళు ఏనాడూలేనంత లావయింది. అయ్యో.. అడవిలో బతకాల్సిన వాళ్ళం. నిత్యం పాములతోటి, తోడేళ్ళతోటి సహజీవనం చేస్తున్నవాళ్ళం. నిద్రకీ, ఆలసత్వానికీ అలవాటు పడకూడదుగదా" వినయంగా అన్నాడు మట్టు. "సరె! వెళ్ళేప్పుడు శృంగిని కూడా వెంటబెట్టుకుని వెళ్ళు" నవ్వుతూ అన్నాడు రామజోగి.

"నన్నా? ఎందుకూ?" కంగారుగా అన్నాడు శృంగి.

"శరీరానికి పట్టిన బద్దకాన్ని వదిలించుకుంటావని. మట్టూ, నిజంగా శృంగిని నీతో తీసికెళ్ళు. ఏ మండపంలో 'ఆ రాత్రి' శృంగిని వుంచావో అదే అతనికి మండలం పాటు ఆవాసంగా మారుతుంది. భోజనం కుండా అడవి దుంపలూ, అడవిలో ఫలాలే. నీకు వీలున్నప్పుడు మాత్రమే శృంగికి తోడువుండు. తాగడానికి నీరు, దీపాలకి నూనే అమరిస్తే చాలు. శృంగీ, పూజాసామగ్రిని ఇద్దరూ మోసుకెళ్ళండి. అక్కడ అమ్మవారికి 40రోజులపాటు చక్రార్చన జరగాలి. ఉదయం, సాయంత్రం కూడా. నెలదాటాక నేను వస్తాను." శృంగివంక చూసి అన్నాడు రామజోగి.

"మరి అమ్మవారికి ప్రసాదాలూ?" నీరసంగా అన్నాడు శృంగి. తలుచుకుంటేనే అతనికి భయమేస్తోంది. నెలరోజులపాటు దట్టమైన కీకారణ్యంలో ఒంటరిగా గడపటమూ... అదీ.. అడవి దుంపలు తింటూ.

"ఆ విషయం నేను చూస్తాను అయ్యా" వినయంగా రామజోగిని చూస్తూ అన్నాడు మట్టు.

"ఇకనేం.. రేపే ప్రయాణం" నవ్వు లోపలికి వెళ్ళాడు రామజోగి. మధురకి అన్నీ వినిపిస్తూనే వున్నాయి.

"పాపం శృంగి. ఆ అడవిలో వుండగలడా?" జాలిగా అన్నది మధుర.

"ఉండాలి మధురా మోకాలి చిప్పలు నెప్పెడతాయని పిల్లాడ్ని పాకకుండా కట్టడి చేస్తే ఏమౌతుందీ? కష్టపడే వ్యక్తికే సుఖం విలువ తెలుస్తుంది. కేవలం సుఖించడం మాత్రమే తెలిసిన వాళ్ళు కష్టం వొస్తే గాజుముక్కలయినట్టు మనసుని ముక్కలు చేసుకుంటారు. ఆ పరిస్థితి రాకూడదనే పంపేది. అదీగాక, అక్కడ నలభై రోజులపాటు నిత్యపూజ జరగాలి. జరిగి తీరాలి" జవాబిచ్చాడు రామజోగి. శృంగీ, మట్టూ ఇద్దరూ రామజోగి మాటలు విన్నారు.

"అడవిలో వుండే గుడి సంగతి యీాయనకెలా తెలుసూ?" మట్టు మనసులో ప్రశ్న కొండంత పెరిగింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments